సాక్షి ఒడిశా

గురువారం । 24 । అక్టోబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు: రూ. 2.44.878

వెండి : 15 గ్రాముల 990 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



ఉత్సాహంగా శిశు మహోత్సవం

గజపతి జిల్లాలోని అనాథ బాలల సంరక్షణ కేంద్రాల బాలబాలికలకు బుధవారం శిశు మహోత్సవం పేరిట వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు.

- 8లో

సమష్టిగా విపత్తుని ఎదుర్కొందాం

• మాజీ సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: ముంచుకొస్తున్న దానా తుఫాన్ విపత్తుని సమష్టిగా ఎదుర్కొందామని మాజీ ముఖ్యమంత్రి, విపక్ష నేత నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చారు. దీని పట్ల భయాందోళనలు వీడి ప్రభుత్వ సూచన మేరకు సహాయ సహకారాలు అందజేయాలని ప్రజలకు అభ్యర్థించారు. ఎన్నిక అయిన ప్రజా ప్రతినిధులు ఆపత్కాలంలో ప్రజలతో కలిసి మెలిసి అందుబాటులో ఉండడం మనోబలాన్ని ఇస్తోందన్నారు.

న్యూస్‌రీల్

బస్సు డ్రైవర్‌పై కత్తితో దాడి



కత్తిపోట్లకు గురైన పుష్పిన్ చంద్ర నాయక్

కొరాపుట్: పట్టపగలు ప్రైవేట్ బస్సు డ్రైవర్ కత్తిపోట్లుకి గురయ్యాడు. బుధవారం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పట్టణంలో ప్రైవేట్ బస్టాండ్ వద్ద ఎంఎస్‌బీ ప్రైవేట్ బస్సుని ఆపి డ్రైవర్ పుష్పిన్ చంద్ర నాయక్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి సమీప పొదల వద్దకు వెళ్లాడు. అయితే అకస్మాత్తుగా ఒక వ్యక్తి హెల్మెట్ ధరించి నంబర్ లేని బైక్ మీద వచ్చి చంద్ర నాయక్‌పై కత్తితో దాడి చేశాడు. దీంతో బాధితుడు కేకలు వేస్తూ రోడ్డు మీదకు వచ్చి పడిపోయాడు. స్థానికులు అక్కడికి చేరుకునేసరికే దాడి చేసిన వ్యక్తి పరారయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా బాధితుడిని ఉమ్మర్‌కోట్ ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి కొరాపుట్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

చేపల చెరువులో విష ప్రయోగం



మృతిచెందిన చేపలు

మల్కన్‌గిరి: కలిమెల సమితి బేజాంగ్‌వాడ పంచాయతీ ఎం.పి.వి.39 గ్రామంలో రైతు సుకుమార్ బైరాగీకి చెందిన చేపల చెరువులో విష ప్రయోగం జరిగింది. బుధవారం ఉదయం చెరువులో చేపలన్నీ మృత్యువాత చెంది పైకి తేలడంతో బాధితులు విషాదంలో మునిగిపోయాకరు. సుమారు ఆరు క్వింటాళ్ల చేపల చనిపోవడంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.


అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్



మాక్‌డ్రిల్‌లో అగ్నిమాపక సిబ్బంది

జయపురం: అగ్ని ప్రమాదాల నుంచి రక్షణకు జయపురం అగ్నిమాపక సిబ్బంది బుధవారం మాక్ డ్రిల్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. అగ్నిమాపక జిల్లా సహాయ అధికారి సురేష్ కుమార్ బారిక్ పర్యవేక్షణలో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిర్వహించిన మాక్ డ్రిల్‌లో ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, ఎలా మంటలను ఆర్పటం, మంటల్లో చిక్కుకున్నవారిని ఎలా రక్షించాలి, క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స, ఆస్పత్రికి తరలించంపై ప్రాక్టికల్‌గా చూపించారు. అగ్నిమాపక విభాగ అధికారి బారిక్‌తో పాటు హవల్దార్ సురేష్‌కుమార్ హల్వ, చిత్త రంజన్ పాంచియ, గుప్తేశ్వర్ కొర్, టంకుధర దురియ, పవనకుమార్ శబర, దిలీప్ కుమార్ నాయక్‌లు మాక్ డ్రిల్ చేసి చూపించారు. కార్యక్రమంలో డాక్టర్లు రవీంద్రనాథ్ మిశ్ర, ఆస్పత్రి మేనేజర్ రూపసి మధుమిత నాయిక్, తధాగత దాస్, ఏఎస్‌వో సురేష్ కుమార్ బారిక్ పాల్గొన్నారు.

ఘనంగా సురభి ఉత్సవం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జయపురం: సబ్ డివిజన్ కుంద్ర సమితి స్థాయి శిశు మహోత్సవం సురభి–2024 ఉత్సవం సమితిలోని కావిడిగుడ గ్రామ కన్యాశ్రమం ప్రాంగణంలో బుధవారం జరిగింది. కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపుభొత్ర ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ, వ్యాస రచన, ఏకాభినయ, సంగీతం తదితర పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలిపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు రాధా బినోద్ సామంతరాయ్, కుంద్ర సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి పొరజ, ఉపాధ్యక్షుడు తరణి సేన్ బిశాయి, ఎంపీ ప్రతినిధి అంబు పాత్రో, కుంద్ర సమితి బీడీవో కపిలేశ్వర తండి, కుంద్ర బ్లాక్ విద్యాధికారి సుకాంత కర్మామి, జిల్లా ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు త్రినాథ్ హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

రాగల 24 గంటల్లో..!

• తీరం దాటనున్న దానా తుఫాన్

• భిత్తరకనికా, ధామ్రా తీరాల్లో అలజడి

• 14 జిల్లాల్లో హెల్ప్‌లైన్ వ్యవస్థ



కంట్రోల్ రూమ్‌లో దానా తుపాను కదలికలను పరిశీలిస్తున్న సిబ్బంది



దానా హెల్ప్‌లైన్ వ్యవస్థ

భువనేశ్వర్: బంగాళాఖాతంలో బలపడిన దానా తుఫాన్ భిత్తరకనికా, ధామ్రా తీర ప్రాంతాల్లో తీరం దాటే అవకాశాలు బలపడుతున్నాయి. రాష్ట్రంలో పలుచోట్ల బుధవారం నుంచే వర్షం మొదలైంది. ఈ నెల 25న వేకువజామున తీరం దాటే అవకాశ మున్నందున అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ సమయంలో గాలుల వేగం గంటకు 100 నుంచి 110 కిలో మీటర్ల వరకు ఉంటుందని ప్రత్యేక సహాయ కమిషనర్ కార్యాలయం వెల్లడించింది. తుఫాన్ ప్రస్తుతం కేంద్ర బంగాళాఖాతం ఉత్తర, పశ్చిమ దిశలో కదులుతోంది. పారాదీప్‌కు ఆగ్నేయ దిశలో 520 కిలోమీటర్లు దూరంలో నెలకొని ఉంది. జాజ్‌పూర్, కేంద్రాపడా, బింఝార్‌పూర్, దశరథ్‌పూర్ తదితర స్థానాల్లో ఇప్పటికే వర్షాలు మొదలయ్యాయి.మరోవైపు గాలుల తాకిడి పలు టీవీ ఛానెళ్ల ప్రసార వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం పొంచి ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సింగిల్ డెడికేటెడ్ హెల్ప్ లైన్ నంబరు జారీ చేసేందుకు ప్రత్యేక సహాయ కమిషనర్ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తుపాను సంబంధిత సత్వర సమాచారం కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు (హెల్ప్‌లైన్) వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు 14 దానా తుఫాన్ ప్రభావిత జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. గంజాం, పూరీ, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, భద్రక్, బాలాసోర్, మయూర్‌భంజ్, నయాగఢ్, ఖుర్దా, కటక్, జాజ్‌పూర్, అంగుల్, ఢెంకనాల్ మరియు కెంజొహార్ జిల్లాల్లో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేస్తారు.

బీఎంసీ హెల్ప్‌లైన్..

స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. తుఫాన్ సంబంధిత సమాచారం కోసం 1929 నంబరుకు డయల్ చేయవచ్చని ప్రకటించింది. దానా తుఫాన్ తీవ్రత పురస్కరించుకుని పలు రైళ్లను రద్దు చేసింది. ప్రధానంగా ఖుర్దారోడ్ రైల్వే మండలంలో పూరీ, ఖుర్దారోడ్, భువనేశ్వర్, కటక్, జాజ్‌పూర్ – కెంజొహార్ రోడ్, భద్రక్, పారాదీప్, బరంపురం, పలాస ప్రాంతాల మీదుగా రాకపోకలు చేసే రైళ్లను రద్దు చేశారు.

స్మారకాలు, మ్యూజియాలు మూసివేత

భువనేశ్వర్: దానా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలో మ్యూజియాలు, స్మారక ప్రాంగణాలను రెండు రోజుల పాటు మూసివేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భారత పురావస్తు శాఖ ఏఎస్ఐ అధీనంలో ఉన్న అన్ని స్మారక, సంగ్రహాలయాలు ఈ నెల 24, 25 తేదీల్లో మూత పడనున్నాయి.

10 లక్షల మందికి సురక్షిత ప్రాంతాలకు..

భువనేశ్వర్: దానా తుపాను తీరం దాటే సమయం దగ్గర పడుతున్న తరుణంలో ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతోంది. బుధవారం సాయంత్రం నాటికి 10 లక్షల మందిని సురక్షి కేంద్రాలకు తరలించినట్లు రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి తెలిపారు. జిల్లా వారీగా పలువురు మంత్రులకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించామని, వీరంతా ప్రజలకు చేరువగా ఉంటూ కార్యకలాపాలు పర్యవేక్షిస్తారని మంత్రి వివరించారు. ప్రధానంగా పంట నష్టం, కూలిన ఇళ్లు, ఇతరేతర వైపరీత్యాల్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి కార్యాచరణ వేగవంతం చేస్తారని చెప్పారు. జాతీయ విపత్తు స్పందన దళం ఎన్‌డీఆర్‌ఎఫ్, ఒడ్రాఫ్ దళాలు ప్రభావిత ప్రాంతాలకు ఇప్పటికే చేరుకున్నాయని వివరించారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురి కాకుండా అధికారులకు సహకరించాలని కోరారు.

మంత్రులకు బాధ్యతలు

భువనేశ్వర్: దానా తుఫాన్ నేపథ్యంలో పలు జిల్లాల్లో విపత్తు నిర్వహణ, స్థానికుల బాగోగుల పర్యవేక్షణకు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పలువురు మంత్రులకు జిల్లావారీగా బాధ్యతలు కేటాయించారు.

జిల్లా	మంత్రి
జగత్‌సింగ్‌పూర్	సంపద్ చంద్ర స్వంయి, పరిశ్రమల శాఖ మంత్రి
బాలాసోర్	రబి నాయక్, తాగు నీరు, పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ
భద్రక్	సూరజ్ సూర్యవంశీ, క్రీడలు, ఉన్నత విద్యా శాఖ మంత్రి
మయూర్‌భంజ్	డాక్టర్ కృష్ణ చంద్ర పాత్రో, గృహ నిర్మాణం, నగర అభివృద్ధి శాఖ మంత్రి
పూరీ	ప్రభాతి పరిడా, ఉప ముఖ్యమంత్రి
కేంద్రాపడా	కనక వర్ధన్ సింగ్ దేవ్, ఉప ముఖ్యమంత్రి
గంజాం	బిభూతి భూషణ్ జెనా, వాణిజ్యం, రవాణా శాఖ మంత్రి
కెంజొహార్	కృష్ణ చంద్ర పాత్రో, ఆహారం, పౌర సరఫరా శాఖ మంత్రి
కటక్	పృథ్విరాజ్ హరిచందన్, నిర్మాణం, న్యాయ శాఖ మంత్రి

సుభద్ర యోజన సవరణకు..

మంత్రి మండలి ఆమోదం



మంత్రి మండలి సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన బుధవారం మంత్రి మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐదు ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదం తెలిపిందని ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా తెలిపారు. మంత్రి మండలి నిర్ణయం మేరకు ఇటీవల ప్రవేశ పెట్టిన సుభద్ర యోజన మంజూరు ప్రక్రియలో సంస్కరణలు చేపట్టేందుకు అంగీకరించారు. ఇటీవల జారీ చేసిన నిబంధనల మేరకు అర్హత కోల్పోయిన వారికి లబ్ధి చేకూర్చే దిశలో సవరణల కోసం ప్రతిపాదించారు. మంత్రి మండలి ఆమోదంతో సుభద్ర యోజన మంజూరుకు అర్హత కోల్పోయిన 1 కోటి 2 లక్షల దరఖాస్తులు దాఖలయ్యాయి. వీరిలో 60 లక్షల మంది అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు పొదుపు ఖాతాలకు సుభద్ర నిధులు ప్రత్యక్షంగా బదిలీ చేయడం పూర్తయింది. ఈ సన్నాహంలో 2 లక్షల 67 వేల దరఖాస్తులు అనర్హత జాబితాలో చేరాయి. వీటిని పునపరిశీలించి సంబంధిత అభ్యర్థులకు సుభద్ర యోజన లబ్ధి కల్పించే దిశలో చర్యలు చేపట్టేందుకు మార్గం సుగమం అయింది.

సమృద్ధి కృషక్ యోజన..

సమృద్ధి కృషక్ యోజన అమలు చేయాలని మంత్రి మండలి తీర్మానించింది. దీంతో రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారు. ఆదాయం సమృద్ధి చెందుతుంది. ప్రభుత్వ అధీనంలో కొనసాగుతున్న వరి విక్రయ వ్యవస్థలో నమోదైన రైతులకు పూర్తి స్థాయి మద్దతు లభిస్తుంది. ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరి విక్రయించే రైతులకు క్వింటాకు రూ.3,100 చొప్పున కనీస మద్దతు ధర చెల్లించేందుకు కేబినెట్ అంగీకరించడం విశేషం. దీంతో బాటు సమృద్ధి కృషక్ యోజన కింద పెట్టుబడి సహాయం అందజేయడం జరుగుతుంది. ఖరీఫ్ సీజను సాగు వరి సేకరణ వ్యవస్థ క్రమబద్ధీకరణ ప్రతిపాదనకు మంత్రి మండలి ఏకీభవించింది. మార్కెటింగ్ సీజను, 2024 – 25 ఆహార, సేకరణ విధానంలో పలు రకాల వరి, బియ్యం నాణ్యత ప్రామాణికాల సవరణకు అంగీకారం తెలిపింది. ఈ ఏడాది 80 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ లక్ష్యమని మంత్రి మండలి పేర్కొంది. వరి విక్రయించిన రైతులకు 24 నుంచి 48 గంటల్లోగా బకాయి చెల్లించాలని మంత్రి మండలి తెలిపింది. పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం మంత్రి మండలి ఒడిశా ద్రవ్య సేవా పన్ను చట్టం, 2017 సవరణకు అంగీకరించింది. మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అరుణ్ కుమార్ షడంగిని ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్ అధ్యక్షుడిగా నియమించే ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలియజేసింది.

• హెల్త్ బృందం సమీక్ష



ఆస్పత్రిని సందర్శించిన హెల్త్ టీమ్

జయపురం: పూల్‌బెడలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిని రాష్ట్ర హెల్త్ బృందం బుధవారం సందర్శించింది. ఆర్ఆర్‌టీ, ఐడీఎస్‌పీ సెల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సూర్జిత్ గోరాబుదు, రాష్ట్ర మైక్రో బయాలజిస్ట్ సశ్మిత మల్లిక్, డాక్టర్ సునీత జెన, మైక్రో బయాలజిస్టు స్వాతీ పటాన్నాయిక్, లక్ష్మీ బిశ్వాల్లు ఆస్పత్రి పరిస్థితులపై సమీక్షించారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలు, ఆస్పత్రిలో లభిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.

దొంగతనం కేసులో ఇద్దరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రాయగడ: దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు సదరు పోలీసులు తెలిపారు. అరెస్టైన వారిలో స్థానిక బురదవలస ప్రాంతానికి చెందిన మహదేవ్ సతీష్, ఎస్.రామక్రిష్టలు ఉన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సదర్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్‌డీపీవో రశ్మిరంజన్ సేనాపతి, ఐఐసీ కేకేబీకే కుహోరోలు తెలియజేశారు. ఈ నెల 16వ తేదీన స్థానిక అశోక్ టాకీస్ కాంప్లెక్స్‌లో షిర్డీ సాయి హార్డ్ వేర్ దుకాణంలో దొంగతనం జరిగిందన్నారు. గుర్తు తెలియని దుండగులు దుకాణంలో రు.30 వేలు నగదు, కొన్ని హార్డ్ వేర్ సామగ్రిని దొంగిలించినట్లు బాధితుడు బొచ్చా గుప్తేశ్వరరావు ఫిర్యాదు చేశారన్నారు.కేసు దర్యాప్తు చేసి సతీష్, రామక్రిష్టలను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్టు వివరించారు. అయితే దుకాణంలో 22 వేల రుపాయలు మాత్రమే దొంగిలించినట్లు అంగీకరించిన నిందితుల నుంచి పోలీసులు రు.10 వేలు నగదు, మరో డి.వి.ఆర్.వస్తువును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు తరలించారు.

అంబులెన్స్‌లో గంజాయి రవాణా



కొరాపుట్: అంబులెన్స్ వద్ద పోలీసులు

కొరాపుట్: అంబులెన్స్‌లో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని కొరాపుట్ పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం నందపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట వాహనాల తనిఖీలు చేపడుతుండగా.. కొంతదూరంలో అంబులెన్స్ ఆగింది. డ్రైవర్ దిగి పారిపోవడంతో పోలీసులు వెళ్లి తనిఖీ చేశారు. అందులో కేజీ 170 గ్రాముల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. తహశీల్దార్ అనాది చరణ్ సాహు సీజ్ చేశారు. ఈ మేరకు నందపూర్ ఎస్‌డీపీఓ సంబిత్ కుమార్ మజ్జి కేసు వివరాలు వెల్లడించారు.

భారీగా గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో తరణి మందిరం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న మల్కన్‌గిరి ఎక్సైజ్ పోలీసులు బుధవారం భారీగా గంజాయి పట్టుకున్నారు. ఓ ఆటో అతివేగంగా వెళ్తుండటంతో అనుమానం వచ్చి ఆపి తనిఖీ చేయగా రెండు బస్తాల్లో గంజాయి పట్టుబడింది. నిందిత డ్రైవర్ రాయిపూర్‌కు చెందిన మహ్మద్ అన్వర్‌గా గుర్తించి కేసు నమోదు చేశారు. 50 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి కుడుముల గుమ్మ పంచాయతీ పర్కన్‌పల్లి అటవీ ప్రాంతంలో దాడి చేసి రవాణాకు సిద్ధంగా ఉన్న గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు బలిమెల ఐఐసీ సుమాన్ పట్నాయిక్ తెలిపారు. దీని విలువ రూ.30 లక్షలు ఉంటుందని చెప్పారు.

50 కిలోల గంజాయి సీజ్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా పోలీసులు 50 కేజీల గంజాయిని బుధవారం స్వాధీనం చేసుకున్నారు. కొరాపుట్ జిల్లా నందపూర్ పోలీసులు కలువా జంక్షన్ వద్ద నాకాబందీ నిర్వహించారు. కారులో వెళ్తున్న కొంతమంది పోలీసులను చూసి కారును వదిలేసి పరారయ్యారు. దీంతో కారును తనిఖీ చేయగా అందులో 50 కేజీల గంజాయి పట్టుబడింది. నందపూర్ ఓఐసీ పాండవ్ సబర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మల్కన్‌గిరి: ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న గంజాయి



మల్కన్‌గిరి: బలిమెల పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

వార్డు సభ్యుడిపై అనర్హత వేటు



జయంతి పట్నాయక్

పర్లాకిమిడి: మోహనా పంచాయతీ ఎన్నికల్లో గెలిపొందిన వార్డు సభ్యుడిపై కోర్టు అనర్హత వేటు వేసింది. వివరాల్లోకి వెళ్తే.. 2022 పంచాయతీ ఎన్నికల్లో మోహనా పంచాయతీ 11వ వార్డు సభ్యురాలిగా జయంతి పట్నాయక్, నరోత్తమ పాత్రోలు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో నరోత్తమ పాత్రో గెలిపొందారు. అయితే ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నప్పటికీ, ఎన్నికల అఫిడవిట్‌లో ఇద్దరు పిల్లలు ఉన్నారని తప్పుగా పేర్కొన్నారని జయంతి పట్నాయక్ ఎలక్షన్ కమిషన్, పంచాయితీ రాజ్ అధికారులకు ఫిర్యాదు చేసింది. అనంతరం మోహనా కోర్టులో కేసు వేయగా నరోత్తమ అభ్యర్థిత్వం చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో బుధవారం ఆమె కలెక్టర్ కార్యాలయానికి విచ్చేసి కోర్టు జడ్జిమెంట్ కాగితాలను కలెక్టర్, పంచాయతీ కార్యాలయాలకు సమర్పించారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

• కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపుభొత్ర



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే రూపుభొత్ర

జయపురం: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కోట్‌పాడ్ ఎమ్మెల్యే రూపుభొత్ర అన్నారు. జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి కార్యాలయంలో సామాజిక సురక్షా విభాగం ఆధ్వర్యంలో భీమ్‌భోయి దివ్యాంగుల సామర్థ్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. కుంద్రా సమితి బీడీవో కపిలేశ్వర తండి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు సామాజిక రక్షణ కల్పించటంతో పాటు వారికి అన్ని విధాల సహకరిస్తామని చెప్పారు. శిబిరంలో సమితి పరిధిలోని 16 గ్రామ పంచాయతీల నుంచి 707 మంది దివ్యాంగులు పాల్గొన్నారు. వారికి డాక్టర్లు బి.ఎస్. మిశ్ర, దుర్గా ప్రసాద్ పాత్ర, దేవాశిష్ మహాపాత్రో, ఎస్.ఎస్.మిశ్ర, డి.సునీల్, లలితేందు మిశ్రలు పరీక్షించి దివ్యాంగ ధ్రువపత్రాలు అందజేశారు. దివ్యాంగులు అధికమంది రావడంతో ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్ స్వరూప మలిక్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సమితి అధ్యక్షురాలు రాజేశ్వరి పొరజ, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు రాధా బినోద్ సామంత రాయ్, సమితి ఉపాధ్యక్షులు తరుణీ సేన్ బిశాయి, జిల్లా పరిషత్ సభ్యురాలు కనకలత పెంటియ, ఎంపీ ప్రతినిధి అంబు పాత్రో, సమితి సామాజిక సురక్షా అధికారి బొలిరాం భొత్ర, సమితి కార్యక్రమాల సహాయకులు బసంత కుమార్ భోల్ పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి స్థలం కేటాయింపు

• తొలుత అభ్యంతరం వ్యక్తం చేసిన స్థానికులు

• అధికారుల వివరణతో శాంతించిన వైనం



గోశాల నిర్మాణాన్ని వ్యతిరేకించిన సునానగర్ ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

జయపురం: జయపురం మున్సిపాలిటీ అధికారులు తలపెట్టిన గోశాల నిర్మాణానికి ఎట్టకేలకు స్థలం ఎంపిక పూర్తయింది. జయపురం సమితి బలియ గ్రామ పంచాయతీ సునానగర్‌లో గోశాల నిర్మాణం జరిపేందుకు అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా బుధవారం స్థలం కొలతలు జరుగుతున్న సమయంలో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఆ ప్రాంతంలో వ్యర్థ పదార్థాల డంపింగ్ యార్డు కోసం మున్సిపాలిటీ రెండు ఎకరాల 90 సెంట్ల స్థలాన్ని ఖరీదు చేసింది. అయితే ఇక్కడ డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు చేసిన ప్రయత్నాలను స్థానికులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో అధికారులు ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. తాజాగా ఆ స్థలంలో గోశాల నిర్మాణానికి మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. అయితే స్థానికులు ఈ ప్రయత్నాన్ని కూడా వ్యతిరేకించటంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. స్థలం మున్సిపాలిటీకి చెందినదని.. ఇక్కడ గోశాల నిర్మాణం వలన సునానగర్ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగదని జయపురం మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ వారికి నచ్చ చెప్పటంతో ప్రజలు శాంతించి గోశాల నిర్మాణాన్ని స్వాగతించారు. దానితో గోశాల నిర్మాణానికి రెండు ఎకరాల 90 సెంట్ల స్థలాన్ని జేబీసీ యంత్రంతో చదును చేయించారు. గోశాల నిర్మాణానికి స్థానిక శాసనసభ్యుడు తారాప్రసాద్ బాహిణీపతి త్వరలో శంకస్థాపన చేస్తారని పట్నాయక్ వెల్లడించారు. స్థల గుర్తింపు కార్యక్రమంలో జయపురం తహసీల్దార్ సవ్యసాచి జెన, రెవెన్యూ సూపర్‌వైజర్ హరిహర శతపతి, తిలీప్ ప్రధాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ జయంతి మరియు పాల్గొన్నారు.



స్థలాన్ని చదును చేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

రాష్ట్ర మహిళా కమిషన్ రద్దు

భువనేశ్వర్: ప్రస్తుతం కొనసాగుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్ష పదవికి మీనతి బెహరా రాజీనామా చేశారు. ఆమెతో పాటు కమిషన్‌లో మిగిలిన సభ్యుల పదవులను రద్దు చేశారు.

దుకాణంలో చోరీ



ఆవేదన వ్యక్తం చేస్తున్న దుకాణం యజమాని

రాయగడ: రాయగడ పట్టణంలో దొంగల బెడద రోజురోజుకూ ఎక్కువవ్వడంతో ప్రజలు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. తాజాగా స్థానిక రథం నిలుపు కూడలి వద్ద గల ఓ టిఫిన్ దుకాణంలో దొంగలు చొరబడి రెండు గ్యాస్ సిలిండర్లు,గ్రైండర్‌ను పట్టుకుపోయారు. ఈ మేరకు బాధితుడు నిరంజన్ గురు సదర్ పోలీస్ స్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేసాడు. రెండు నెలలల క్రితమే ప్రారంభించిన దుకాణంలో చోరీ జరగడంతో బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా కేసు దర్యాప్తు ప్రారంభించారు.

బొల్లినేనిలో 'స్టోర్ అసోసియేట్' ఉచిత శిక్షణ


శిక్షణ పొందుతున్న ఒడిశా విద్యార్థులు

పర్లాకిమిడి: ఒడిశా స్కిల్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో స్టోర్ అసోసియేట్ (ఫార్మసీ) కోర్సులో ఉచిత శిక్షణ, తదనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు బొలినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.నాగేశ్వర్ రావు తెలిపారు. ఈ కోర్సుకు ఒడిశాలోని అన్ని జిల్లాల విద్యార్థులూ అర్హులేనని చెప్పారు. ప్లస్ టు, గ్యాడ్యుయేషన్‌లో సైన్సు బ్యాక్‌గ్రౌండ్ చదివి వయో పరిమితి 18 నుండి 35 ఏళ్ల గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణా కాలంలో యూనిఫాం, కోర్సు మెటీరియల్, భోజన, వసతి సౌకర్యం విశాఖపట్నంలో కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రిలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 8008889395, 8247656581, 7995013422 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రౌడీ షీటర్ హల్‌చల్

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని దమ్మలవీధిలో మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి ఒక రౌడీ షీటర్ హల్‌చల్ చేశాడు. బాకర్‌సాహెబ్ పేటలో మరో వ్యక్తి కూడా మద్యం మత్తులో అల్లరి చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. న్యాయస్థానం ఇరువురికీ 14 రోజుల రిమాండ్ విధించింది. ఒకటో పట్టణ ఎస్ఐ హరికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం రాత్రి దమ్మలవీధిలో నివసిస్తున్న రౌడీషీటర్ వండాన డిల్లీశ్వరరావు (డిల్లీ) మద్యం మత్తులో స్థానికులతో గొడవపడ్డాడు. దీంతో 112కి వారు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఒకటో పట్టణ పోలీసులు ఢిల్లీని అదుపులోకి తీసుకున్నారు. అదేరోజు రాత్రి బాకర్‌సాహెబ్‌పేటలో బద్రి త్రినాథరావు అనే యువకుడు పూటుగా మద్యం సేవించి అక్కడి నివాస గృహాల వారికి ఇబ్బందులు సృష్టించాడు. దీంతో వారు కూడా 112కు ఫిర్యాదు ఇవ్వడంతో త్రినాథరావును పోలీసులు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎస్ఐ హరికృష్ణ ఇరువురిపై కేసులు నమోదు చేశారు. బుధవారం నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. శ్రీకాకుళం సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఇరువురికీ 14 రోజుల పాటు రిమాండ్‌తో కూడిన జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ హరికృష్ణ అన్నారు. వండాన డిల్లీశ్వరరావుపై రౌడీషీట్ ఉండగా, బద్రి త్రినాథరావుపై గతంలోనూ కేసులున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఎవరైనా ఇలా మద్యం బహిరంగంగా సేవించి అల్లర్లుకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. మొన్నటికి మొన్న ఇలాగే అల్లరి చేసిన రౌడీషీటర్‌ను రిమాండ్ జైలుకు తరలించామన్నారు.

కారును ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి


రక్తపు మడుగులో చాణుక్య మృతదేహం

శ్రీకాకుళం క్రైమ్ : కారును బైక్‌తో ఢీకొట్టిన ఘటనలో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం చెందిన ఘటన బుధవారం జిల్లా కేంద్రంలోని 80 అడుగుల రోడ్డులో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ నాగరాజు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు. బ్యాంకర్స్ కాలనీలో నివాసముంటున్న సోమయాజుల వెంకటశ్రీనివాస్, ఈశ్వరి దంపతుల కుమారుడు వెంకటకృష్ణ చాణుక్య (23) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. దసరా సెలవులకని ఇంటికొచ్చి వర్క్‌ఫ్రం హోం చేసుకుంటున్నాడు. ఇంకా వివాహం కాలేదు. స్నేహితులు పిలవడంతో 80 ఫీట్ రోడ్డులో టీ తాగేందుకు వెళ్లాడు. అక్కడ స్నేహితుడి స్పోర్ట్స్ బైక్‌ను తీసుకుని డ్రైవ్ చేయగా అరసవిల్లి మిల్లు జంక్షన్ వైపు వెళ్తున్న కారును ఢీకొట్టాడు. బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ నాగరాజు, సిబ్బంది ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

ఖాళీ బిందెలతో ఆందోళన

● తాగునీరు అందించాలని ధర్నా ● గంటల తరబడి ట్రాఫిక్ జామ్


రామగిరి-ఆర్.ఉదయగిరి రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు


రోడ్డుకు అడ్డంగా దుంగలు కాల్చి ఆందోళన చేపడుతున్న మహిళలు


రామగిరి - ఆర్.ఉదయగిరి రోడ్డుపై బైఠాయించిన మహిళలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి బ్లాక్ పరిసర గ్రామంలో బుధవారం ఉదయం మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. ఆర్.ఉదయగిరి-మోహనా-బరంపురం మధ్య వాహనాలు నిలిచిపోయాయి. రామగిరి ప్రాంతం పరిసర గ్రామంలో గతకొన్ని నెలలుగా ప్రజా ఆరోగ్య మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందటం లేదు. గ్రామంలో బోర్లు కూడా ఎండిపోయాయి. దీర్ఘకాలిక తాగు నీటి సమస్యపై గతంలో కలెక్టర్ రామగిరి వచ్చినప్పుడు (గ్రీవెన్స్ సెల్) గ్రామస్తులు విన్నవించినా ఫలితం లేకపోయింది. దీంతో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై ధర్నా చేపట్టారు. సమాచారం అందుకున్న రామగిరి పోలీసు అధికారి, బీడీఓ, సర్పంచ్, ప్రజా ఆరోగ్యశాఖ ఇంజినీర్ ప్రభాకర్ తదితరులు మహిళల వద్దకు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా ఆరోగ్య మంచినీటి పథకం కింద తాగునీటిని సరఫరా చేస్తున్న ఆపరేటర్‌ను విధుల నుంచి తొలిగించాలని మహిళలు డిమాండ్ చేశారు. అధికారులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఉత్సాహంగా శిశు మహోత్సవం


అతిథులకు పెయింటింగ్స్ బహూకరిస్తున్న అనాథ బాలలు


శిశు మహోత్సవంలో జానపద నృత్యాలు


బాలికల సంప్రదాయ నృత్యాలు


హాజరైన బాలబాలికలు


సంబల్‌పురి నృత్యాలు

పర్లాకిమిడి : గజపతి జిల్లాలోని అనాథ బాలల సంరక్షణ కేంద్రాల బాలబాలికలకు బుధవారం వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు. స్థానిక బిజూ కల్యాణ మండపంలో శిశు మహోత్సవాన్ని 'మహక్' పేరిట జిల్లా శిశు సురక్షా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి బాలలను ఉత్సాహపరిచారు. జిల్లా జడ్జి ప్రణబ్‌కుమార్ రైత్రాయ్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కలెక్టర్ బిజయకుమార్ దాస్ మాట్లాడుతూ అనాథలమని బాధపడకుండా ఉన్నత చదువులు చదివి లాయర్లు, ఇంజినీర్లు, డాక్టర్లు వంటి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని కోరారు. అనంతరం బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి ప్రాణకృష్ణ పాణిగ్రాహి, డి.సి.పి.యు. అరుణ్‌కుమార్ త్రిపాఠి, శిశు సంక్షేమ సమితి అధ్యక్షులు అశ్వినీ కుమార్ మహాపాత్రో, జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్, చైల్డ్ లైన్ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

భువనేశ్వర్: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలను నిత్యావసర సరుకులు, సామగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. ఈ బలహీన పరిస్థితిని వ్యాపారులు సొమ్ము చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. నిత్యావసర సరుకులను అధిక ధరలకు విక్రయించే పనిలో పడ్డారు. దీనిపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఎవరైన సరుకులను కృత్రిమ కొరత సృష్టి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అవాంఛనీయ ధరల పెరుగుదలకు సంబంధించి ప్రభావిత వర్గాలు సకాలంలో సమాచారం అందజేయాలని తెలిపింది. ఈ సంప్రదింపుల కోసం ఆహార, పౌరసరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖకు సంబంధించి 0674- 2396227 నంబర్‌కు తెలియజేయాలని సూచించింది.

తుఫాన్‌ను సమర్థంగా ఎదుర్కొందాం


ఎస్ఆర్‌సీ కంట్రోల్ రూమ్‌ను సందర్శిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి

భువనేశ్వర్: దానా తుఫాన్ వల్ల ఏ ఒక్కరూ మృతి చెందకుండా సర్వసన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి అన్నారు. బుధవారం ఒడిశా విపత్తు స్పందన ఓస్డమా కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఉన్నతాధికారులతో చర్చించారు. విపత్తులో ఏ ఒక్కరి ప్రాణానికి హాని కలగకుండా ముందస్తుగా భద్రత, రక్షణ కార్యకలాపాలు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అంతకుముందు ప్రత్యేక సహాయ కమిషనరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన దానా కంట్రోల్ రూమ్ వ్యవస్థను సీఎం పరిశీలించారు. తుఫాన్‌కు సంబంధించి పక్కా సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు. ఆయనతో పాటు ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, రాష్ట్ర పోలీస్ డైరెక్టరు జనరల్ వై.బి.ఖురానియా, అభివృద్ధి కమిషనర్ అనూ గర్గ్ తదితరులు ఉన్నారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న డంపుతో జవాన్లు

మల్కన్‌గిరి: చిత్రకొండ సమితి స్వభీమాన్ ఏరియాలో ఘనుబేఢ, గుర్రసేత్ గ్రామాల మధ్య 177 బీఎస్ఎఫ్ జవాన్లు కూంబింగ్ నిర్వహిస్తుండగా బుధవారం మధ్యాహ్నం కొండకంబేర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల డంప్‌ను గుర్తించారు. ఓ చెట్టు కింద డ్రమ్ములో దాచిన ఈ డంపులో 3 కేజీల స్టీల్ టిఫిన్ బాంబు, కేజీ స్టీల్ టిఫిన్ బాంబు, పైపు బాంబు, 9 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 9 జిలెటిన్ స్టిక్స్, చిన్న బ్యాటరీ, 10 మీటర్ల కరెంటు వైరు, 2 సోలార్ ప్లేట్లు, 2 మందుసీసాలు, 40 లీటర్ల ప్లాస్టిక్ డ్రమ్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన సపక్‌తక్ర స్టేట్‌మీట్

● మహిళల ఛాంపియన్‌గా నిలిచిన ఆతిథ్యశ్రీకాకుళం
● పురుషుల విభాగంలో కర్నూలు విజయకేతనం
● విజేతలకు బహుమతులు అందజేసిన మాజీ మంత్రి కృష్ణదాస్


ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారిణుల జోరు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు వేదికగా ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన 34వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) సీనియర్స్ పురుషుల, మహిళల సపక్‌తక్ర ఛాంపియన్‌షిప్-2024 పోటీలు బుధవారం రాత్రితో ముగిశాయి. ప్రభుత్వం నుంచి రూపాయి సాయం లేకపోయినప్పటికీ.. పోటీలకు హాజరైన క్రీడాకారులను ఆకట్టుకునేలా సౌకర్యాలు, వసతులు, భోజనాలు ఏర్పాటు చేసిన సపక్‌తక్ర సంఘ జిల్లా బాధ్యులు శభాష్ అనిపించారు. ఆద్యాంతం హోరాహోరీగా సాగిన మహిళల విభాగ పోటీల్లో ఆతిధ్య శ్రీకాకుళం జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. తూర్పు గోదావరితో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 2-1 సెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఆద్యాంతం రసత్తవరంగా సాగిన పురుషుల విభాగం పోరులో కర్నూలు జిల్లా విజేతగా నిలిచింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో జరిగిన ఫైనల్ పోరులో 2-1 సెట్ల తేడాతో కర్నూలు విజయదుందుబీ మోగించింది.

క్రీడాకారులకు విశ్వవ్యాప్త గుర్తింపు: కృష్ణదాస్

క్రీడాకారులకు విశ్వవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి జరిగిన ముగింపు, బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడలకు ఆర్థికంగా చేయూతను అందిస్తూ నిరంతరం ప్రోత్సహిస్తున్న ఎమ్మెస్సార్, పద్మావతి దంపతులను, స్వరూప్‌ను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో అన్ని క్రీడాసంఘాలు, అందరి ఆమోదంతో శ్రీకాకుళం ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎమ్మెస్సార్ కృష్ణమూర్తిని ప్రతిపాదిస్తామని కృష్ణదాస్ చెప్పుకొచ్చారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి మాట్లాడుతూ ఓటమి నుంచి గెలుపునకు బాటలు వేసుకోవాలని, క్షేమంగా మీమీ జిల్లాకు చేరుకోవాలని క్రీడాకారులకు సూచించారు. ఎంవీ స్వరూప్ రెండు రోజులపాటు జాతీయ స్థాయి టోర్నీని తలదన్నే విధంగా స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించినందుకు గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని టోర్నీలు శ్రీకాకుళంలో నిర్వహిస్తామన్నారు.

సపక్‌తక్ర జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి జి.అర్జున్‌రావురెడ్డిలు మాట్లాడుతూ రెండు రోజుల పోటీలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సపక్‌తక్ర సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్వీడీ మురళీకృష్ణ, మానస హోటల్ పైడి శ్రీనివాస్, ట్రాఫిక్ జామ్ శ్రీనివాస్, న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్, సుందరరావు మాస్టారు, బీఏ లక్ష్మణ్‌దేవ్(అను), అంబటి శ్రీనివాస్, బాలమురళి, వేణుగోపాల్, బాబ్జి, కొర్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో వెస్ట్ బెంగాల్‌కి చెందిన యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని పలాస జీఆర్పీ ఎస్ఐ ఎస్కే షరీఫ్ తెలిపారు. అతను తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం రాత్రి స్థానిక రైల్వేస్టేషన్‌లో వెస్ట్ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌కి చెందిన సంతు కర్మాకర్(24) అనే యువకుడు డౌన్‌లైన్ ట్రాక్‌లో బరంపురం వైపు వెళ్లే గూడ్స్‌రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక రైల్వేస్టేషన్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


పోలీసుస్టేషన్ వద్ద విలపిస్తున్న గ్రామస్తులు


మృతి చెందిన లక్ష్మణ్

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలస వద్ద ఆమదాలవలస మున్సిపాలిటీకి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న ఎన్టీఆర్ కాలనీలో బుధవారం జరిగిన ప్రమాదంలో విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని పొన్నాంపేట గ్రామానికి చెందిన గృహ నిర్మాణ కార్మికుడు (తాపీ మేస్త్రీ) కర్రి లక్ష్మణ్ (24) ప్రతిరోజూ ఆ కాలనీలో కూలి పని చేసేందుకు వెళ్తున్నాడు. అదేవిధంగా బుధవారం పనికి వెళ్లిన మృతుడు పని ప్రారంభానికి ముందు నీరు అవసరమని, అక్కడ ఉన్న విద్యుత్ వైర్లను మోటారు వేసేందుకు ప్లగ్‌లో పెడుతుండగా విద్యుత్ షాక్‌తో పడిపోయాడు. వెంటనే తోటి కార్మికులు జొన్నవలస గ్రామంలో ఉన్న 30 పడకల సామాజిక ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు. వైద్యులు పరిశీలించి యువకుడు మృతి చెందినట్లు నిర్ధారించారు. కుమారుడు మృతి చెందాడని తెలుసుకున్న తల్లిదండ్రులు ఆదిలక్ష్మి, సిమ్మయ్యలు కన్నీటి పర్యంతమయ్యారు. లక్ష్మణ్ మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. మృతుడికి ఇద్దరు అన్నదమ్ములు ఉన్నారు.

పెళ్లి పీటలు ఎక్కాల్సిన సమయంలో...

మృతుడికి పాలకొండకు చెందిన ఒక అమ్మాయితో వివాహం కుదిరిందని, ఫిబ్రవరి నెలలో వివాహానికి మూహూర్తం కూడా పెట్టుకున్నారని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెళ్లి పీటలు ఎక్కించాల్సిన యువకుడిని పాడి ఎక్కించాల్సి వచ్చిందని వారంతా చేస్తున్న రోదనలు మిన్నంటాయి. మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ఐటీడీఏ ఏర్పాటుకు.. మోక్షమెప్పుడో ?


ఐటీడీఏ ఏర్పాటు చేయాలని దీక్ష చేస్తున్న గిరిజన సంఘాలు (ఫైల్)



● తాము అధికారంలోకి వస్తే మెళియాపుట్టిలో ఏర్పాటు చేస్తామన్న కూటమి నేతలు
● హామీని నిలబెట్టుకోవాలంటున్న గిరిజన సంఘం నేతలు
● 100 కిలోమీటర్ల దూరంలోని సీతంపేట వెళ్లాల్సి వస్తోందని ఆవేదన

మెళియాపుట్టి:

సార్వత్రిక ఎన్నికల సమయంలో పాతపట్నం నియోజకవర్గానికి వచ్చిన కూటమి నేతలు.. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని హామీలు గుప్పించారు. ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్నా ఆ ఊసే వినిపించక పోవడంతో గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. జిల్లాల పునర్విభజనలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ(ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ- సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ) పార్వతీపురం మన్యం జిల్లాలో కలిసిపోయిన సంగతి తెలిసిందే. సమస్యలు చెప్పుకోవడానికి సుమారు 80 నుంచి 1000 కిలోమీటర్ల దూరంలో ఉన్న సీతంపేట ఐటీడీఏకు వెళ్లాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో మెళియాపుట్టి, మందస, కొత్తూరు, పాతపట్నం మండలాల్లో అధికంగా గిరిజనులు ఉన్నారు. 16 గిరిజన ఉప ప్రణాళిక మండలాలు ఉన్నాయి. విభజన ప్రక్రియలో భాగంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలో 847 గిరిజన గ్రామాలు ఉండగా శ్రీకాకుళం జిల్లాకు 469, మన్యం జిల్లాకు 378 గ్రామాలను కేటాయించారు. అయితే విభజన అనంతరం రహదారులు, తాగునీరు, విద్య, వైద్య సదుపాయాలు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. అత్యధిక గిరిజన గ్రామాలు ఉండి, అన్ని గ్రామాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉండే మెళియాపుట్టి మండలకేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఇదివరకే గిరిజన సంఘాలు పలు జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, దీక్షలు, ఆందోళనలు చేశారు. అయినా ఇంతవరకు మోక్షం కలగలేదు.

100 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..

గిరిజనుల సమస్యలపై అధికారులకు చెప్పాలంటే సీతంపేటలో ఉన్న ఐటీడీఏకు 80 నుంచి 100 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సిందే. మందస, నందిగాం, మెళియాపుట్టి, పాతపట్నం, సారవకోట, ఎల్ఎన్‌పేట మండలాలకు చెందిన గిరిజనులు సమస్యలతో సతమతమవుతున్నా ఆర్థిక స్థోమత లేక వెళ్లలేకపోతున్నారు. స్థానికంగా ఐటీడీఏ ఏర్పాటైతే సమస్యలు తీరుతాయని గిరిజన సంఘాల నాయకులు, ప్రజలు చెబుతున్నారు.

మూడు బస్సులు మారాలి..



సమస్యలు చెప్పుకోవడానికి వెళ్లడమే మాకు పెద్ద సమస్యగా మారింది. సీతంపేట ఐటీడీఏకు వెళ్లాలంటే మూడు బస్సులు మారాలి. రూ.500 ఖర్చు అవుతుంది. ఎన్నిసార్లు వెళ్లగలం. ఆర్థిక పరిస్థితులు బాగోలేక సమస్యలు చెప్పుకోవడానికి వెళ్లలేకపోతున్నాం. మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది.
– పద్దూరు భీమారావు, దీనబంధుపురం, మెళియాపుట్టి మండలం

పోరాటాలు చేస్తున్నా..



గిరిజనుల కష్టాలు తీరాలంటే ఐటీడీఏ ఏర్పాటు అవసరం. దీనికోసం రాష్ట్రం, జిల్లా స్థాయిలో ఆందోళనలు, దీక్షల ద్వారా పోరాటాలు చేస్తూనే ఉన్నాం. ఢిల్లీ వరకు వెళ్లి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల మెళియాపుట్టి మండలం కేరాసింగి గ్రామాన్ని ఆయన సందర్శించిన సమయంలోనూ సమస్య వివరించాం. – వాబ యోగి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

న్యాయం చేయాలి..



జిల్లా విభజన జరిగిన అనంతరం శ్రీకాకుళం జిల్లా గిరిజనులు తీవ్రంగా నష్టపోయారు. సీతంపేట ఐటీడీఏ మన్యం జిల్లాకు వెళ్ళిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఇటీవల రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రిని సైతం కలిసి వినతిపత్రం అందించాం. గిరిజన యువత ఎంతోమంది స్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్నారు. ఐటీడీఏ వస్తే ఉపాధి లభిస్తుంది.
– చల్లా శాంతారావు, గిరిజన సంఘం నేత, మెళియాపుట్టి మండలం

క్లుప్తంగా

25 వరకు ఓపెన్ ప్రవేశాలకు గడువు


జి.పగడాలమ్మ,డీఈఓ

పార్వతీపురం: జిల్లా విద్యాశాఖాధికారి పర్య వేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్య ప్రవేశా లకు జూలై 31నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా, అపరాధ రుసుం లేకుండా ఈనెల 25వ తేదీలోగా ఆన్‌లైన్ అడ్మి షన్ పొందవచ్చు. అలాగే రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 26నుంచి 29వ తేదీవరకు అడ్మిషన్‌కు అవకాశం కల్పిస్తారు. ఈనెల 30,31వ తేదీలలో రూ.500 అపరాధ రుసుం తో ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించవచ్చు. ప్రవే శాలు పొందగోరే వారు ఆయా అధ్యయన కేం ద్రాల్లో ఏఐ కోర్డినేటర్ వద్ద దరఖాస్తు ఆన్‌లైన్ చేయించుకుని, ఏపీ ఆన్‌లైన్ సెంటర్‌లో ఫీజు చెల్లించాలి. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి జి. పగడాలమ్మ బుధ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


సారా వంటకు ఉపయోగిస్తున్న సామగ్రిని ధ్వంసం చేస్తున్న ఎస్సై అనీష్, పోలీస్ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి పరిసర ప్రాంతాలలో అక్రమంగా నిల్వ ఉం చిన 20 లీటర్ల సారాను చినమేరంగి ఎస్సై అనీష్ ఆధర్యంలో పోలీస్ సిబ్బంది బుధవారం రైడ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ సందర్భంగా గ్రామ శివారులో సారా వంటచే స్తున్న ప్రాంతాలలో 400 లీటర్ల బెల్లంఊటను పట్టుకుని ధ్వంసం చేశారు. సారా తయారీ, అమ్మకాలపై సమాచారమిచ్చిన వారిపేర్లను గోప్యంగా ఉంచుతామని ప్రజలు సహకరిం చాలని ఎస్సై అనీష్ కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చెరకుతోటలు దగ్ధం


బొడ్డవలసలో అగ్నికి ఆహుతైన చెరకుపంట

రేగిడి: మండలంలోని బొడ్డవలస గ్రామంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో చెరకు తోటలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన మజ్జి సాంబమూర్తి చెరకుతోటపై నుం చి వెళ్తున్న హైటెన్షన్ విద్యుత్ సరఫరా తీగలు రాపిడికి గురై నిప్పులు రావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు బాధిత రైతులు వాపోతు న్నారు. ఈ ప్రమాదంలో సాంబమూర్తితో పాటు ఆలుబిల్లి శ్రీను, దుర్గారావు, మజ్జి కృష్ణ, తూతిక మాధవ తదితర రైతులుకు చెందిన ఐదు ఎకరాల్లోని చెరకు తోటలు పూర్తిగా కాలిపోయాయి. సమాచారం మేరకు పాలకొం డ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్సై సర్వేశ్వరరావుతో కలిసి మం టలను అదుపుచేశారు. రూ.2 లక్షల వరకూ పంట నష్టం ఉంటుందని అంచనా వేశారు.

పోలీసులమంటూ బెదిరింపులు

బొబ్బిలి: పట్టణంలోని పాత బొబ్బిలికి చెదిన తెర్లాం మండల ఉపాధ్యాయుడు మింది విజయమోహన రావు త్రుటిలో సైబర్ మోసం నుంచి తప్పించుకున్నారు. ఈ మేరకు బుధ వారం ఆయన పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం ఆయన కుమారుడు విదేశాల్లో ఉన్నాడు. కుమారుడి ద్వారా హవాలా సొమ్ము విజయమోహన రావుకు వస్తోందని, డిజిటల్ అరెస్టు చేస్తామని పోలీసుల పేరుతో నకిలీ వ్యక్తులు ఆయనకు ఫోన్‌చేశారు. పోలీసులకు సమాచారం ఇస్తానన్న ఆయన మాటలు విని అవతలి వారు ఫోన్ కట్ చేశారు. ఈ మేరకు అన్ని ఆధారాలతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా రేపు

బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 25న హెటిరో డ్రగ్స్, యంగ్ ఇండియా, పేటీఎం తదితర బహుళజాతి పరిశ్రమల ఆధ్వ ర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణా రావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ,డిగ్రీ ఉత్తీర్ణులైన ఆసక్తి గల అభ్యర్థులు ఏపీ నైపుణ్యా భివృద్ధిసంస్థ వెబ్ సైట్‌లో రిజిస్టర్ చేసు కోవాలని, సంబంధిత రిఫరెన్స్ నంబర్‌తో ఈనెల 25న అన్ని సర్టిఫికెట్లు, ఫొటోలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9618792572, 9988853335లను సంప్రదిం చాలని సూచించారు.

తిన్నది కక్కాల్సిందే..!

- ఉపాధి నిధుల వాడకంపై డ్వామా అధికారులు
- రికవరీ చేయాల్సిన నిధులు రూ.2.91 కోట్లు
- ఇంతవరకు రూ.1.48 కోట్లు వసూలు


గంట్యాడ మండలంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులు (ఫైల్)

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ ప్రాంతాల్లో వలస లను నివారించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ప్రవేశ పెట్టారు. అయితే అది కొంతమం ది అక్రమార్కులకు వరంగా మారింది. ఉపా ధిహామీ పథకంలో అక్రమాలకు పాల్పడి అందిన కాడికి దోచుకున్నారు. సోషల్ ఆడిట్ (సామజిక తనిఖీ)లో సిబ్బంది అక్రమాలు బయటపడ్డాయి. దీంతో వారు తిన్న సొమ్మును కక్కించేందుకు డ్వామా (జిల్లా నీటియాజమాన్య సంస్థ) అధికారు లు రికవరీ అస్త్రాన్ని ఉపయోగిస్తున్నారు. ఇప్పటికే కొంతమేర వసూలు చేశారు. మిగతాది కూడా వసూలు చేసేందుకు సిబ్బందికి రికవరీ నోటీసులు ఇచ్చారు. ఉన్న ఊళ్లో పనులు లభించడంతో గ్రామా ల్లోనే పనులు చేసుకుంటూ వేతనదారులు జీవనం సాగిస్తున్నారు.గ్రామంలో జరిగిన ఉపాధి పనులు, మెటీరీయల్ పనులపై సోషల్ ఆడిట్ సిబ్బంది ప్రతి ఏటా సామాజిక తనిఖీ నిర్వహిస్తారు. మండ లస్థాయిలో నిర్వహించే సామాజిక తనిఖీ ప్రజావే దికలో గ్రామస్థాయిలో గుర్తించిన వివరాలను అధికారులకు అందజేస్తారు. మండలాల్లో సామా జిక తనిఖీ ప్రజావేదికసభలు అయిన తర్వాత జిల్లా స్థాయిలో చివరిగా నిర్వహిస్తారు. సోషల్ ఆడిట్ సిబ్బంది ఎవరి నుంచి ఎంత రికవరీ చేయాలన్న వివరాలను డ్వామా అధికారులకు అందజేస్తారు. వాటి అధారంగా సిబ్బంది నుంచి డ్వామా అధికారులు రికవరీ చేస్తారు.

2.91కోట్లు రికవరీ చేయాల్సి ఉంది

ఉపాధి హామీ పథకంలో క్షేత్ర సహాయకులు (ఫీల్డ్ అసిస్టెంట్స్) సాంకేతిక సహాయకులు (టెక్నికల్ అసిస్టెంట్స్) ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ (ఈసీ), కం ప్యూటర్ ఆపరేటర్స్, ఏపీఓలు క్షేత్ర స్థాయిలో పనిచే స్తుంటారు. సోషల్ ఆడిట్ సిబ్బంది రికవరీకి సూచించింది కూడా ఈ కేడర్ల వారినే. జిల్లా వ్యాప్తం గా రూ. 2.91 కోట్లు రికవరీ చేయాలని సోషల్ ఆడిట్ సిబ్బంది సూచించారు. ఇప్పటి వరకు రూ.1.48కోట్లు రికవరీ చేశాం. ఇంకా 1.43 కోట్లు మిగిలి ఉంది. ఇందులో ఆర్‌ఆర్ యాక్ట్ కింద రూ.కోటి, సిబ్బంది నుంచి రూ. 43 లక్షలు రికవరీ చేయాల్సి ఉంది.

సిబ్బంది జీతాల నుంచి రికవరీ

ఉపాధి హామీ సిబ్బంది కట్టాల్సిన సొమ్మును వారి జీతాల నుంచి అధికారులు రికవరీ చేస్తున్నారు. ఇప్పటికే సిబ్బంది నుంచి చాలావరకు డ్వామా అధికారులు రికవరీ చేశారు.

ఇంకా వసూలు చేయాల్సి ఉంది

సిబ్బంది నుంచి రికవరీ చాలా వరకు చేశాం. మిగతాది కూడా ప్రతి నెలా రికవరీ చేస్తు న్నాం. రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద రూ.కోటి, సిబ్బంది నుంచి రూ. 43 లక్షలు రికవరీ చేయాల్సి ఉంది.

ఇ.సందీప్, డ్వామా పీడీ

హై రిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి

- వైద్యాధికారులకు కలెక్టర్ ఆదేశాలు


మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురంటౌన్: జిల్లాలో రక్తహీనతతో ఉండే గర్భిణులు, హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారిం చాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యాధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఎటువంటి మాతా, శిశు మరణాలు జరగరాదని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. హైరిస్క్ కేసులను ముందే గుర్తించి వారికి అవసరమైన వైద్యాన్ని, మందులను అందిం చాలని చెప్పారు. మాతా శిశుమరణాల మృతికి కారణమయ్యే అధికారులు, సిబ్బంది పట్ల చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితుల పట్ల పూర్తిగా అవగాహన ఉండాల న్నారు. గర్భిణులను ఆస్పత్రిలో చేర్పినప్పుడు సం బంధిత ఆసుపత్రి మంచి వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేసినా, ఏఎన్ఎంలు తీసుకు వెళ్లినట్లు తమ దృష్టికి వచ్చినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. జిల్లాలో డెంగీ, మలే రియా, ఫైలే రియా వంటి కేసు లు నమోదు కాకుండా నివార ణ కార్యక్రమాలను విస్తృతం చేయాలని చెప్పారు. గ్రామాలలో పారిశుధ్యం నిర్వహణలో ప్రజలను భాగస్వాములను చేయాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, సీజనల్ వ్యాధులు, పారిశుధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి కె.విజయ పార్వతి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వాగ్దేవి, డీఎల్ఏటీఓ డా.వినోద్ కుమార్, ఇతర వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ విద్యాదీవెన విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జాన్సన్‌బాబు

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇం జినీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.2100 కోట్లు, వసతి దీవెన రూ.1400 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ నిధు లను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయ నగరంలోని అమర్ భవన్‌లో బుధవారం నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు సంబంధించి నాలుగు క్వార్టర్ల రూపంలో డబ్బులు జమ అయ్యే వని, గత సంవత్సరం విద్యార్థులకు కేవలం ఒక క్వార్టర్ మాత్రమే విడుదలై మిగతా మూడు క్వార్టర్లు విడుదల కాలేదన్నారు. రాష్ట్రంలో దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ ఇంజినీరింగ్ పీజీ విద్యను అభ్యసిస్తున్నారు. దానిలో ఒక క్వార్టర్ ఫీజులు రూ.708 కోట్లు విడుదల చేశారు.మూడు క్వార్టర్లకు సంబంధించి దాదాపు రూ.2100 కోట్లు విడుదల చేయలేదని, రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియిం బర్స్‌మెంట్,వసతి దీవెన డబ్బులు విడుదల చేయ కుండా విద్యార్థులకు కోర్సులు అయిపోయినప్పటికీ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కళాశాల యాజమాన్యులు, ఇబ్బంది పెడుతున్నాయని, ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులకు షరతులు పెడు తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రియింబర్స్‌మెంట్, వసతి దీవెనకు అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి పరీక్షలు రాసేందుకు అనుమతిం చాలని, అదేవిధంగా వారి సర్టిఫికెట్లు కూడా అంద జేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆం దోళన నిర్వహిస్తామని ఈ సందర్భంగా హెచ్చరిం చారు.కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.నాగభూషణం సహాయ కార్యదర్శులు పి.గౌరీ శంకర్, దుర్గ, ఉపాధ్యక్షుడు ఎ.సుమన్ నాయకులు భాను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి, ఐదవ విడతలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు పట్టణ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ బుధ వారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అభ్యర్థి నేరు గా .ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవ చ్చని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న తరువాత అభ్యర్థి దరఖాస్తు చేసిన ఐటీఐ కళాశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకుని వెళ్లి వెరిఫికేషన్ ప్రా సెస్ పూర్తిచేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఐటీఐలలో ఈ నెల 28న, ప్రైవేట్ ఐటీఐలలో ఈ నెల 30న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వివరిం చారు.

రాష్ట్రస్థాయి విలువిద్య పోటీలకు సిద్ధంగా క్రీడా మైదానం


మాట్లాడుతున్న డీఈఓ పగడాలమ్మ

సీతానగరం: రాష్ట్రస్థాయి విలువిద్య(ఆర్చరీ) పోటీలను సీతానగరం మండలంలోని జోగిం పేటలో నిర్వహించనున్న సందర్భంగా క్రీడా మైదానాన్ని సిద్ధం చేస్తున్నామని పార్వతీపురం మన్యం డీఈఓ పగడాలమ్మ అన్నారు. ఈ మేరకు మండలం లోని జోగింపేట డాక్టర్ బీఆర్అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో క్రీడలకు సిద్ధం చేస్తున్న క్రీడామైదానాన్ని బుధ వారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబరు 3,4,5 తేదీలలో 13 ఉమ్మడి జిల్లాల ఉన్నత పాఠశాలలకు చెందిన 600 మంది క్రీడాకారులకు జోగింపేట క్రీడా మైదానంలో జిల్లా గేమ్స్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించను న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.మురళి, ఆర్గనైజింగ్ జిల్లా కార్య దర్శి డీటీ గాంధీ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కొమరాడ వాసి మృతి

- విశాఖ జిల్లాలో ప్రమాదం


ఘటనా స్థలంలో మృతి చెందిన వెంకటనాయుడు, క్షతగాత్రుడు వెంకటేష్


వెంకటనాయుడు (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: మేనల్లుడికి సంబంధించి అమ్మ వారి పూజలో పాల్గొని తిరిగి వెళ్తున్న అతని మేన మామ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. దీనిపై విశాఖ జిల్లా గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వ రరావు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక ప్రాంతం జోగువానిపాలెంలో ఉంటున్న ఏదురు వెంకటేష్ భవానీ మాలవేశాడు. బుధవారం పూజ అనంతరం భిక్ష కార్యక్రమానికి పార్వతీపురం జిల్లా కొమరాడకు చెందిన మేన మామ కోండ్రు వెంకటనాయుడి(54)ని ఆహ్వానిం చాడు. ఈ కార్యక్రమానికి హాజరైన వెంక టనాయుడు తిరుగు ప్రయాణంలో కంచరపాలెం లోని తన బంధువులను కలుసుకోవడానికి వెంకటే ష్‌తో కలిసి స్కూటీపై బయల్దేరాడు. స్కూటీపై పూజాసామగ్రితో గాజువాక నుంచి ఎన్ఏడీ వైపు వేగంగా వెళ్తూ..ఎయిర్‌పోర్టు సమీపంలో వంతెన వద్ద అదుపుతప్పి డివైడర్‌ను స్కూటీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న వెంకటనాయుడు రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అక్క డికక్కడే మృతి చెందారు. స్కూటీ నడుపుతున్న వెం కటేష్ చేతులు, కాళ్లకు తీవ్ర గాయాల య్యాయి. ఈ సమాచారం అందుకున్న ట్రాఫిక్ సీఐ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలిం చారు. వెంకటేష్ కేజీహెచ్‌లో చికిత్స పొందుతు న్నాడు. వెంకటనాయుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యారంగానికి మొండిచేయి

- ఎస్ఎఫ్ఐ మండిపాటు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: అమరావతిలో జరిగిన మంత్రిమండలి నిర్ణయాలలో కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని చర్చకు తీసుకురాకపోవడం దుర్మా ర్గమైన విషయమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు డి.రాము, సీహెచ్ వెంకటేశ్‌లు మండిప డ్డారు. ఈ మేరకు స్థానిక ఎల్‌బీజీభభవన్‌లో బుధ వారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో గత రెండు సంవత్సరాలుగా డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రియింబర్స్ మెంట్‌ను ఆపేసిందని దీంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆం దోళన వ్యక్తం చేశారు. ఈ ఇబ్బందులను ప్రభుత్వా నికి తెలియజేయాలన్న ఉద్దేశంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వ ర్యంలో రెండు రోజుల క్రితం కలెక్టరేట్ వద్ద ఆం దోళన నిర్వహించామన్నారు. అదే సందర్భంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పోరాటం చేశారని తెలిపారు. ఈ పోరాటాన్ని గ్రహించిన ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో విద్యార్థులకు అండగా ఉంటామని, గత ప్రభుత్వం బాకీ పెట్టిన, అలాగే ఈ ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజులను కలిపి విద్యార్థులకు ఇచ్చే విధంగా కృషి చేస్తానని ప్రకటన చేయించిందని తెలిపారు. కానీ నేడు జరిగిన మంత్రి మండలి నిర్ణ యాలలో విడుదల చేయాల్సిన స్కాలర్‌షిప్ నిధుల మీద ఎటువంటి స్పందన లేకపోవడం విద్యార్థుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోం దని విమర్శించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఎటువం టి నిర్ణయం వెలువడక పోతే జిల్లాలో విద్యార్థులు అందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తా మని దీనికి జిల్లా విద్యా యంత్రాంగం, రాష్ట్రప్రభు త్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిం చారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

గజపతినగరం: విజయనగరం మహారాజా ఆస్పత్రిలో వైద్యసేవలు పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి బుధవారం చెందాడు. ఈ మేరకు గజపతినగరం ఎస్సై కె.లక్ష్మణరావు తెలియ జేసిన వివరాల ప్రకారం గజపతినగరం మండలం లోని మదుపాడ గ్రామం సమీపంలో ఈనెల15వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి పడిపోవడంతో విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించే ఏర్పాటు చేశారు. పరిస్థితి విషమించడంతో బుధవారం ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతూ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మదుపాడ వీఆర్‌ఓ కె.విష్ణుమూర్తి ఇచ్చిన సమాచారం మేరకు కేసును నమోదు చేసి నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలియరాలే దని, వివరాలు తెలిసినవారు తమను సంప్రదిం చాలని మహరాజా ఆస్పత్రిలో మృతదేహాన్ని ఉం చినట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య..


రమేష్ మృతదేహం

వంగర: మండల పరిధి అరసాడ గ్రామానికి చెందిన గాడి రమేష్(31) పురుగుమందు తాగి బుధవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు హెచ్ సీ వావిలపల్లి రామకృష్ణ తెలిపారు. కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగిన రమేష్‌ను కుటుంబ సభ్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో జీఎంఆర్ రక్షలో సెక్యూరిటీ గార్డు గా పనిచేస్తున్నాడని, తండ్రి అప్పలసూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు హెచ్‌సీ వెల్లడించారు.

అకారణంగా అర్ధరాత్రి తిరిగితే కేసులు

- ఎస్పీ వకుల్ జిందాల్


వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

విజయనగరం క్రైమ్: సహేతుక మైన కారణం లేకుండా అర్ధ రాత్రి వేళ పట్టణాల్లో తిరిగితే టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదుచేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గడిచిన నాలుగు నెలల్లో ఇప్పటి వరకు 450 మందిపై న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదుచేశామని, కౌన్సెలింగ్ ఇచ్చామని పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో భాగంగానే రాత్రి గస్తీ, పెట్రోలింగ్‌లో మౌలిక మార్పులు చేప ట్టామని తెలిపారు. పట్టణంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, మూడులాంతర్లు, కోట, బాలాజీ జంక్షన్, దాసన్నపేట రైతు బజార్, రింగురోడ్డు, కొత్తపేట, ఐస్ ఫ్యాక్టరీ, జమ్ము, వీటీ అగ్రహారం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపా లిటీల్లో కొన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ పోలీసులు తనిఖీలు చేపడుతున్నార న్నారు. రాత్రి 11 గంటల తర్వాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకుం టూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యాపా రాలు చేసినా, కారణాల్లేకుండా రోడ్లపై తిరిగినా కేసులు నమోదుచేయాలని ఆదేశించినట్లు స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించి, వారి వివరాలు పూర్తిగా తెలుసుకున్న తర్వాతనే విడిచిపెట్టాలని పోలీస్ అధికారులకు తెలియజేశారు.

పైడితల్లి అంబలం పూజకు ఏర్పాట్లు పూర్తి

విజయనగరం టౌన్: గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది పైడితల్లి అమ్మవారి అంబలం పూజను కోట వద్ద భారీ ఎత్తున నిర్వ హించేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పైడి మాంబ దీక్షా పీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్య పాత్రో పేర్కొన్నారు. ఈ మేరకు ఆలయ ఆవ రణలో బుధవారం సిరిమాను పూజారి బంటు పల్లి వెంకటరావు, గురుస్వాములు ఎస్.అచి వ్రెడ్డి, బొంగ మహేష్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25న శుక్రవారం సాయంత్రం కోట వద్ద శ్రీపైడిమాంబ దీక్షాధా రులతో భారీ ఎత్తున అంబలం పూజ నిర్వహి స్తామన్నారు. అష్టలక్ష్మిలతో కూడిన పైడిమాం బ అంబలం అరటి దవ్వలతో కట్టి తొమ్మిది కలశాలకు కుంకుమపూజలను, దీక్షాధారులతో పడిపూజ నిర్వహిస్తామన్నారు. పైడితల్లి దీక్షాప రులతో పాటు వివిధ రకాల మాలాధారణ చేసిన దీక్షాధారులందరూ హాజరవుతారని చెప్పారు. అమ్మవారి భక్తులందరూ కార్యక్రమం లో పాల్గొని తల్లి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.నాగరాజు, శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ఓపెన్ హౌస్


డాగ్ స్క్వాడ్ విన్యాసాలు

పార్వతీపురంటౌన్: జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పార్వతీపురంలోని పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్ ఆవర ణలో 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ ఎస్వీమా ధవ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభిం చారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు పాఠశాల లు/కళాశాలల విద్యార్థులు తరలివచ్చారు. ఎస్పీ, ఇతర పోలీస్‌అధికారులు 'ఓపెన్ హౌస్'లో విద్యా ర్థులతో మమేకమై, ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం ఎస్పీ, ఏఆర్ అధికారులు, పోలీసుశాఖ సిబ్బంది విధి నిర్వహణలో ఉపయోగించే వివిధ ఆయుధాలు, అత్యాధునిక పరికరాల పట్ల విద్యార్థు లకు అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తి నిం పారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో తీవ్రవాదులతో పోరాడుతూ ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమర వీరుల సం స్మరణార్థం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిం చామన్నారు. ఈ ఓపెన్ హౌస్‌లో పోలీసుశాఖ ఉప యోగించే సాంకేతికత, క్లూస్ టీం, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ వివిధ ఆయుధాలను విద్యార్థులకు చూపించి వాటిగురిం చి వివరించారు. కార్యక్ర మంలో అదనపు ఎస్పీ డా.ఒ.దిలీప్ కిరణ్, ఏఎస్పీ అంకిత సురాన, ఏఆర్ డీఎస్పీ ఎస్.వి.అప్పారావు, ఎఆర్ ఆర్ఐలు శ్రీరాములు, శ్రీనివాస రావు, ఏఆర్ ఆర్ఎస్సైలు, సిబ్బంది, కమ్యూనికేషన్, క్లూస్ టీం సిబ్బంది శ్రీజన్, ఏకలవ్య పాఠశాలలు, భాస్కర్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయు లు పాల్గొన్నారు.


ఆయుధాల పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్పీ

క్రమం తప్పకుండా తాగునీటి పరీక్షలు

- మండల ప్రత్యేకాధికారి కూర్మినాయుడు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో తాగునీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి కూర్మినాయుడు సూచించారు. మండలంలోని జోగిరాజుపేటలో చేపడుతున్న నీటి నాణ్యత పరీక్షలను బుధవారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీరు కలుషితమైతే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరీక్షల విష యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పైప్‌లైన్లను నిత్యం పరిశీలిస్తూ లీకులను సరిచేయాలని, ట్యాంక్‌లను శుభ్రపర చాలన్నారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలు సుకోవాలన్నారు. కార్యక్రమంలో రామకృష్ణరా జు, ఈఓపీఆర్‌డీ శంకర జగన్నాథ్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹132	₹234	₹244